క్లుప్తంగా

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెద్దాపురం: మండలంలోని శృంగార వల్లభ స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణ మూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం, విరాళాలు, దర్శనాలు, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్కరోజు సుమారు రూ.3.22 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈఓ తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలతో టోర్నీ నిర్వాహకులు

కొత్తపల్లి: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అన్నారు. మూలపేటలో వైఎస్సార్ సీపీ నాయకుడు కంబాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. ఈ టోర్నీలో 15 జట్లు పాల్గొంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడల్లో యువత పాల్గొనాలన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ పోటీలో విన్నర్‌గా మూలపేటకు చెందిన సింహాద్రి టీం, రన్నర్‌గా అజయ్ టీం నిలిచారు. వీరికి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, అడ్డా త్రిమూర్తులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల నిరసన

పిఠాపురం: ఉద్యోగ భద్రత కల్పించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగులు చిత్రాడలో శనివారం ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. 104 డీఈఓ రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నామన్నారు. అటువంటి వారిని ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూస్తుందన్నారు. పాదయాత్రలో 104 ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్ల రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



అన్నవరానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి: మూలపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి శనివారం వైఎస్సార్ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. కొండా అన్నవరానికి రూ.10వేలు, ముత్తు శివకు, మేరుగు నల్లయ్యకు రూ.5 వేలు చొప్పున అందజేశారు. పరామర్శించిన వారిలో మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మత్స్యకార నాయకుడు కంబాల లక్ష్మణ్, అడ్డా త్రిమూర్తులు ఉన్నారు.

యువత అభ్యున్నతికే రోటరీ సేవలు

బోట్‌క్లబ్: చిన్నతనం నుంచే సేవారంగంపై అభిరుచి కలిగించాలన్న ఉద్దేశంతో అంతర్జాతీయ రోటరీ యువతకు ప్రత్యేక స్థానం కల్పించిందని కాంట్రాక్టర్ బి.ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక రోటరీహాల్‌లో శనివారం రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన మాసోత్సవాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఇంటరాక్ట్, రోటరాక్ట్ క్లబ్‌ల ద్వారా యువతలో సేవాభావం కలిగేలా సేవా కార్యక్రమాలను రూపొందించి రొటేరియన్ల ద్వారా అంతర్జాతీయ రోటరీ అమలు చేస్తోందన్నారు. క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ మాట్లాడుతూ రోటరీ బ్లడ్‌బ్యాంక్‌కు అవసరమైన ప్రత్యేక పరికరాలను దేవి ఫిషరీస్ అధినేత యార్లగడ్డ వీర్రాజు సమకూర్చారన్నారు. క్లబ్ కార్యదర్శి వద్దాది ఆదిత్య, సభ్యులు ఎస్ శ్రీకాంత్, నరహరిశెట్టి రవికృష్ణ, జీకే శ్రీనివాస్, మాచారెడ్డి, హరిదత్త కుమార్, బళ్ల సత్యపాల్ పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా

కరప: వేసవిలో తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నట్టు ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతానికి వేళంగి గ్రామంలోని శివారు ప్రాంతాలు, కరప శివారు పేపకాయలపాలెంలో పూర్తి స్థాయిలో మంచినీటి ట్యాంకులు నిండకపోవడంతో ఆయా ప్రాంతాల్లో తాగునీరు సరఫరా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించి తాగునీటి సరఫరాను పరిశీలించారు. గ్రామ సర్పంచ్‌లు సవిలే నీలిమ, సాదే ఆశాజ్యోతి, కరప ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ సరఫరాను పర్యవేక్షించారు.

కొనుగోలుకు భరోసా

- అన్నదాతకు అందుబాటులో ఆర్బీకేలు
- ప్రైవేటు వ్యక్తులను కాదని విక్రయాలు
- మండలంలో 9 వేల టన్నుల ధాన్యం సేకరణ



వీకే రాయపురం పీఏసీఎస్ వద్ద ధాన్యం లోడుతో రైతు



ఆర్బీకేలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: మండల పరిధిలో రైతులు ప్రస్తుత దాళ్వా సీజన్‌లో 22,250 ఎకరాలలో వరి పండించారు. బొండాల దిగుబడితో పాటు మార్కెట్ రేటు కూడా ఎక్కువగా ఉంటుందని ఆశించి రైతులు మండలంలో 80 శాతం వరకు బొండాలు పండించారు. రైతులు ఊహించినట్టే ఎకరానికి 60 నుంచి 65 బస్తాల దిగుబడి వచ్చింది. మండలంలో 77,309 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం నాటికి మండల పరిధిలో 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు అధికారులు తెలిపారు. 75 కేజీల బస్తాకు ఆర్బీకేలో రూ.1530 చెల్లిస్తున్నట్టు వ్యవసాయా ధికారులు తెలిపారు. ప్రైవేటు వ్యక్తులు రూ.1,400 మాత్రమే చెల్లిస్తున్నారు. ఆర్బీకేలకు వచ్చిన రైతులకు వారికి కేటాయించిన రైస్ మిల్లుకు ధాన్యం తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. రైతు పోలం నుంచి మిల్లుకు రవాణా చేయడానికి అయ్యే రవాణా, ధాన్యం ఎగుమతి దిగుమతి ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుండడంతో రైతులు ఆర్బీకేల వైపే మక్కువ చూపుతున్నారు. మండల పరిధిలో 17 ఆర్బీకేలు అందుబాటులో ఉన్నాయి. అయితే మరికొంత మంది రైతులు కొంత కాలం ఆగితే బొండాలకు బయట వ్యక్తులు రూ.1600 వరకు చెల్లించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

నాలుగు రోజులలో నగదు జమ



తన పొలంలో 148 బస్తాల ధాన్యాన్ని ఆర్బీకేలో విక్రయించాను. కేవలం నాలుగు రోజులో రూ.2.26 లక్షలు బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. దీనికి తోడు ధాన్యం బటావ్వడాకు సంచులు, రవాణా చార్జీ, హమాలిల చార్జీలు ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఈ మేరకు ప్రత్యేకంగా చెల్లింపులు జరుగుతాయని అధికారులు తెలిపారు.

– పెదిరెడ్ల కొండలరావు, రైతు, వీకే రాయపురం

రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో సిబ్బంది...



ప్రతి ఆర్బీకేలో వీఏఏలు అందుబాటులో ఉన్నారు. వారు ప్రతి రైతు పొలంలోనికి వెళ్లి ధాన్యం విక్రయంపై అవగాహన కల్పిస్తున్నారు. ముందుగా కోతలు పూర్తి చేసుకున్న రైతులకు అపరాలు పండించేలా వెయ్యి కేజీల మినుములు, 1,500 కేజీల పిల్లిపెసర, 1,200 కేజీలు పెసలు సబ్సిడీపై అందజేస్తున్నాం. వీటిని పీబీ దేవం, జి..మేడపాడు, ఉండూరు, అచ్చంపేట గ్రామాల్లో రైతులు వేసుకున్నారు. జూన్ మొదటి వారంలో గోదావరి కాలువకు నీరు విడుదల అయ్యే అవకాశం ఉంది. దాంతో జూన్ నుంచి నాటు వేసుకొంటారు.

– ఐ.సత్య, ఎంఏఓ, సామర్లకోట

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

తెలంగాణ హైకోర్టు జడ్జి రాజేశ్వరరావు



ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జడ్జి రాజేశ్వరరావు

పెద్దాపురం: ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి నామవరపు రాజేశ్వరరావు అన్నారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో ఆంధ్రా, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఐడీఎస్ఎస్‌సీ 2023కు ఎంపికైన క్యాడెట్ల శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఎన్‌సీసీ కాకినాడ బెటాలియన్ గ్రూపు కమాండర్ కల్నల్ ఏకే రిషి అధ్యక్షతన జరిగిన సదస్సులో జస్టిస్ రాజేశ్వరరావు విద్యార్థికి దృఢ సంకల్పం, ఆత్మ విశ్వాసం, నిబద్ధతతో కూడిన శిక్షణ ఎన్‌సీసీతోనే సాధ్యపడుతుందని అన్నారు. అనంతరం ఏటీసీ 1 కమాండెంట్ కల్నల్ వివేక్ సావన్ గొడర్ క్యాంపు వివరాలను తెలియజేశారు. విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి, సీఏ అబ్దుల్ నబీ, ఏఎన్ ఓలు, మిలటరీ సిబ్బంది, 540 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక



గ్రంథాలయంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న విమలారాణి

పెద్దాపురం: రైతే దేశానికి వెన్నెముక అని ఉపాధ్యాయిని వాడపల్లి విమలారాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం జై కిసాన్, జైవాన్ అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ ఇక్కడి పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయిని విమలారాణి మాట్లాడుతూ రైతు దేశానికి అమ్మ అయితే, జవాన్ తండ్రి వంటివాడని పేర్కొన్నారు. వారి రువురి సేవలపై విద్యార్థులకు అవగాహన అవసరం అన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు నీతి పద్యాలు, తాత్పర్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రీస్కూల్‌పై ఆసక్తి పెరిగేలా బోధన



అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులతో సూపర్‌వైజర్, టీచర్లు

సామర్లకోట: ప్రీస్కూల్‌పై చిన్నారుల్లో ఆసక్తి పెరిగేలా అంగన్‌వాడీ టీచర్లు పని చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలాకుమారి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక బ్రౌన్‌పేట గణేష్ కాలనీలో ఐసీడీఎస్ సీడీపీఓ ఉష ఆదేశాల మేరకు సంసిద్ధత ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్యార్థుల్లో జ్ఞాపకశక్తిని, సృజనాత్మకతను పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు శారీరక అభివృద్ధి, బుద్ధి వికాసం, భాషా నైపుణ్యం, సృజనాత్మకత, జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందించే పౌష్టికాహారం సకాలంలో అందించాలన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించారు. ప్రదమ్ సూపర్ ట్రైనర్ ఎ.ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.సరోజ, రమణి, మాలతి కుమారి, రత్నం, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 646 కేసుల పరిష్కారం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న జడ్జి సరస్వతి



కేసులు పరిష్కరిస్తున్న 12వ అదనపు జిల్లా జడ్జి వసంతి

పెద్దాపురం: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 564 కేసులు పరిష్కరించినట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సరస్వతి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు నాలుగు బెంచ్‌ల్లో న్యాయమూర్తులు ఎస్.సరస్వతి, ఎం.హరి నాయయణ, జి.శ్రీదేవి, ఎ.నాగమల్లేశ్వరి కేసులు పరిష్కరించారు. కక్షిదారులకు ఇన్నర్ క్లబ్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

82 కేసుల పరిష్కారం

పిఠాపురం: స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. 4 బెంచ్‌ల ముందుకు 256 కేసుల రాగా ఇరుపక్షాల మధ్య రాజీ కుదర్చడం ద్వారా 82 కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్‌లో 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వసంతితో పాటు పలువురు పాల్గొన్నారు.

జల వనరుల పరిరక్షణ అందరి బాధ్యత



వలస పక్షులు, జలవనరుల సంరక్షణపై మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి, ఉపాధ్యాయిని అరుణసూర్య

సామర్లకోట: జల వనరుల పరిరక్షణ అందరి బాధ్యత అని స్థానిక గ్రంథాలయాధికారి బందిల రత్నమణి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా శనివారం ప్రపంచ వలస పక్షుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ ఉపాధ్యాయిని బుర్రా అరుణ సూర్య పక్షులలో రకాలు, వాటి విశిష్టత వివరించారు. ఐక్యరాజ్య సమితి జలవనరుల సంరక్షణ ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడానికి అవకాశం ఉంటుందని సూచించారు. ఈ మేరకు జలవనరులు కలుషితం కాకుండా చూడాలని రత్నమణి పిలుపు నిచ్చారు.

గుండెనొప్పితో రైలు ప్రయాణికుడి మృతి



అరుణ్‌కుమార్‌కు 108లో చికిత్స అందిస్తున్న సిబ్బంది

సామర్లకోట: విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న రైలు నుంచి శనివారం దిగిన వ్యక్తి మృతి చెందాడు. రైల్వే స్టేషన్ మేనేజరు కథనం ప్రకారం గుర్తు తెలియని రైలు నుంచి దిగిన రంగారెడ్డి జిల్లా, కుత్బుల్లాపూర్, అయోధ్యనగర్‌కు చెందిన అందులూరి అరుణ్‌కుమార్ (29) గుండె నెప్పితో మూడో నంబరు ఫ్లాట్‌ఫాంపై దిగాడు. రైల్వే ప్రయాణికులు అతని పరిస్థితిని గమనించి 108కు ఫోన్ చేశారు. విషయం తెలుసుకున్న రైల్వే స్టేషన్ మేనేజరు రైల్వే డాక్టరు జి.సురేంద్రకు సమాచారం ఇచ్చారు. రైల్వే డాక్టరు ప్రాథమిక చికిత్స చేస్తున్న తరుణంలో 108 రావడంతో అతనిని 108లో సామర్లకోట ఆస్పత్రికి తరలించే సమయంలో మార్గం మధ్యలో చనిపోయాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగరతీరాన అలజడి



సూర్యారావుపేట బీచ్‌లో ఎగసిపడుతున్న కెరటాలు

కాకినాడ రూరల్: వేసవి తాపంతో ఉపశమనం పొందడానికి, కాస్త విరామానికి నగర ప్రజలు సముద్ర తీరానికి పోటెత్తడం ఈ కాలంలో సర్వ సాధారణమై పోయింది. అలలలో కాసేపు ఆడుకుంటూ, ఒడ్డున ఇసుకలో కొంత సేపు కూర్చుని అలల ఒరవడిని, ఉరవడిని వీక్షిస్తూ ఇహం మరచి ఎంతో సేద తీరుతున్నారు. కాగా శనివారం మోచా తుఫాన్ ప్రభావంతో కాకినాడ సముద్ర తీరంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. పెద్ద ఎత్తున కెరటాలు వస్తూ సముద్రం ముందుకు రావడంతో సందర్శకులు కొంత ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన పోలీసులు సాయంత్రం నుంచి సందర్శకులను నిలువరించారు.

విరబూసిన మే పుష్పం



మే నెలలో విరబూసిన మే పుష్పాలు స్థానిక కాకరపల్లి గంగధర్‌రావు స్వగృహం శనివారం విచ్చుకున్నాయి. ఎంతో అపురూపంగా పెంచుకుంటున్న మొక్కల నుంచి ఒక్కసారిగా 12 మే పుష్పం విరబూయడంతో అందరూ ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– కొత్తపల్లి

ఆడుతూ పాడుతూ



చిన్నారులకు బొమ్మలతో బోధిస్తున్న కార్యకర్త వెంకటలక్ష్మి

- అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్నంగా విద్యాబోధన
- బొమ్మలు, ఆట వస్తువుల ఏర్పాటు
- పిల్లల్లో చదువుపై పెరుగుతున్న ఆసక్తి



ఆట వస్తువులు, బొమ్మల కొలువు

కొత్తపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వినూత్న పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నారు. పిల్లల్లో చదువుపై ఆసక్తి పెంచేలా బొమ్మలు, ఆట వస్తువులు ఏర్పాటు చేశారు. ఈ బొమ్మలతో ఆడుతూ పాడుతూ వారికి అర్థమ్యేలా పాఠాలు చెబుతున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో 321అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాలకు మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు సుమారు 4907 మంది పిల్లలు వస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారుల్లో మేథా శక్తి పెంచేందుకు వినూత్నంగా బోధిస్తున్నారు. అంగన్‌వాడీ భవనం లోపలి గోడలపై రంగుల బొమ్మలు, ఆట వస్తువుల చిత్రాలతో తీర్చిదిద్దుతున్నారు. వీటి ద్వారా పిల్లలకు కార్పొరేట్ కాన్వెంట్లు, ప్రీస్కూళ్లకు దీటుగా సలభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు.

కేంద్రాల్లో ఉన్న బొమ్మలు

అంగన్‌వాడీల్లో ముడేళ్ల పిల్లలకు చిత్రలేఖనం పుస్తకాలను ఇస్తున్నారు. ఇందులో గీసి ఉన్న ఆకారాలపై రంగులు వేయిస్తూ, వర్క్ పుస్తకాల్లో అక్షరాలు రాయిస్తున్నారు. దీని వల్ల చిన్న చిన్న పదాలను రాయడం, చదవడం అలవాటవుతుంది. వివిధ ఆకారాల్లో ప్లాస్టిక్ బీడ్స్, వృత్తం, త్రికోణం, చతురస్రం వివిధ రంగుల్లో ఉంటాయి. ఇవి చిన్నవి, పెద్దవి ఉంటాయి. రంగులు గుర్తించి, వాటిని వేరు చేయడం వల్ల పిల్లల్లో పరిశీలన ఆసక్తి పెరుగుతుంది. గోడలపై రంగులతో రాసిన అక్షరమాల, ఏబీసీడీలు, కూరగాయలు, అంకెలు చిన్నారుల్లో ఆవేంటో తెలుసుకోవాలన్న ఆసక్తిని పెంచుతాయి.

ఆట వస్తువులతో విద్యా బోధన



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి నాడు–నేడు ద్వారా చర్యలు తీసుకున్నారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంచడంలో పాటు సృజనాత్మకత, మేధోశక్తి పెంచేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను బొమ్మల కొలువుగా తీరిదిద్దారు. బొమ్మలతో బోధించడంతో చిన్నారులు ఎంతో ఆసక్తిగా వింటున్నారు. ఈ పద్ధతిలో పిల్లలు పాఠాన్ని సులభంగా అర్థం చేసుకుంటారు. గతంలో కన్న ఇప్పుడు చిన్నారుల హాజరు శాతం పెరిగింది.

– డి.వెంకటలక్ష్మి, కొత్తపల్లి అంగన్‌వాడీ కార్యకర్త

స్మార్ట్ సిటీ.. ఇక చకచకా..

- కాకినాడలో ఊపందుకోనున్న ప్రాజెక్టులు
- రూ.136 కోట్ల బకాయిల విడుదల
- ఆకర్షణీయ నగరంవైపు పరుగులు



నిర్మాణంలో ఉన్న రాగిరెడ్డి కళాక్షేత్రం

కాకినాడ: స్మార్ట్‌సిటీ పథకంలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులు మళ్లీ వేగం పుంజుకోనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఆకర్షణీయ నగరంగా ఎంపికైన కాకినాడ కార్పొరేషన్‌కు ఇప్పటికే సుమారు రూ.వెయ్యి కోట్ల విలువైన అనేక అభివృద్ధి పనులను చేపట్టారు. నగర ప్రతిష్ఠను పెంచేలా, ప్రజలకు ప్రయోజనం కలిగేలా మరికొన్ని ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అయితే నిధుల కొరతతో కొంత అవాంతరం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం తాజాగా రూ.136 కోట్ల బకాయిలు విడుదల చేయడంతో పనులు మళ్లీ ఊపందుకోనున్నాయి.

వేగవంతం కానున్న పనులు

రూ.38 కోట్లతో ప్రతిపాదించిన నగరపాలక సంస్థ కార్యాలయ భవనం ఆధునీకరణ, రూ.20 కోట్లతో ప్రతిపాదించిన రాగిరెడ్డి కళాక్షేత్రం, రూ.15 కోట్లతో చేపట్టిన సైన్స్ సెంటర్, రూ.18 కోట్లతో కన్వర్టబుల్ స్టేడియం పనులు ఇప్పుడు వేగం పుంజుకోనున్నాయి. ఒకేచోట వివిధ క్రీడలు నిర్వహించేందుకు అత్యధిక వీక్షకులు పట్టేలా నిర్మిస్తున్న కన్వర్టబుల్ స్టేడియం నిర్మాణంలోనూ కదలిక రానుంది. వీటితో పాటు స్మార్ట్ సిటీ పథకంలో ప్రతిపాదించిన మరికొన్ని రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు కూడా రావడంతో నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సైతం స్మార్ట్‌సిటీ పనులు వేగవంతం చేసే క్రమంలో నిధుల కోసం నేరుగా ప్రభుత్వ పెద్దలతో ఇటీవల అనేకసార్లు నేరుగా కలిసి చర్చించారు. నగర పాలక సంస్థ కమిషనర్, స్మార్ట్ సిటీ ఎండీ డాక్టర్ మహేష్ కుమార్ ఇటీవలే పెండింగ్ పనులపై సదరు కాంట్రాక్టర్లతో సమావేశమై పనులను వేగంగా పూర్తి చేయాలని, ఇందుకు అవసరమైన తోడ్పాటును అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో నిధులు విడుదల కావడంతో కాంట్రాక్టర్లు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రభుత్వం నుంచి నిధుల బకాయిలు విడుదలయ్యాయని, త్వరలోనే నగరపాలక సంస్థ కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని సుధాకర ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ వంగ పుల్లారెడ్డి తెలిపారు.

పనులు వేగవంతం చేయండి

స్మార్ట్ సిటీ పథకంలో ప్రతిపాదించిన పెండింగ్ పనులన్నీ కాంట్రాక్టర్లు వేగవంతం చేయాలి. నిర్ణీత గడువు లోపు పనులన్నీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం స్మార్ట్ సిటీ బోర్డు తరపున అవసరమైన తోడ్పాటు అందిస్తాం. పనులు మాత్రం పూర్తి నాణ్యత ప్రమాణాలతో పారదర్శకంగా, వేగవంతంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు కూడా పర్యవేక్షించాలి.

– డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, కమిషనర్

వేట్లపాలెం పంచాయతీ అవినీతి నిగ్గు తేల్చాలి

సామర్లకోట: గత పాలకుల హయాంలో వేట్లపాలెం పంచాయతీలో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఆ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ నిడదవోలు సురేష్‌చౌదరి, సీనియర్ నాయకుడు గోలి బాబ్జీ మాట్లాడుతూ మొదటి విడతలో జరిగిన విచారణలో అధికారులు ఒత్తిళ్లకు లొంగిపోయారని ఆరోపించారు. సోమవారం నుంచి జరిగే రెండో విడత విచారణలో పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలించి, నిధులు దుర్వినియోగం చేసినవారి నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ ఆస్తులకు రక్షణ కల్పించేలా కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పంచాయతీలో జరిగిన అవినీతిని బహిరంగంగా నిరూపించడానికి తమ వద్ద పూర్తి స్థాయిలో ఆధారాలు ఉన్నాయని తెలిపారు.